నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I హైదరాబాద్, శుక్రవారం 29 నవంబర్ 2024 YADADRI BHUVANAGIRI

## గిరి ప్రదక్షిణకు ప్రత్యేక ఏర్పాట్లు

యాదగిరిగుట్ట, నవంబర్ 28 : లక్ష్మీనరసింహ స్వామి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రంతోపాటు కార్తిక మాసం ముగుస్తుండడంతో శుక్రవారం గిరి ప్రదక్షిణకు దేవస్థానం అధికారులు ప్రత్యేక ఏర్పాటు చేశారు. కొండ కింద వైకుంఠ ద్వారం వద్ద రంగు రంగుల విద్యుత్ దీపాలను అలంకరించారు. గిరి ప్రదక్షిణ ప్రారంభమయ్యే వైకుంఠ ద్వారం వద్ద స్వామి, అమ్మవార్ల ప్రత్యేక విగ్రహాలను ఏర్పాటు చేశారు. పక్కనే సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు తాత్కాలిక స్టేజీ నిర్మించారు. సుమారు100 మంది కళాకారులు వివిధ రకాల ప్రదర్శనలు ఇవ్వనున్నారు. 500 మంది భక్త భజన మండలి చే కోలాటం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.


వైకుంఠ ద్వారం వద్ద విద్యుత్ లైటింగ్



## కోరలు చాస్తున్న సారా కాసి

### సూర్యాపేట జిల్లాలో గుప్పుమంటున్న గుడుంబా

- పది నెలల్లో 1,030కిపైగా కేసులు.. వెలుగుచూడని స్థావరాలు వేలల్లో..
- గత సర్కారులో సారా తయారీని ఉక్కుపాదంతో అణిచివేసిన కేసీఆర్
- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో మళ్లీ విపరీతం

సూర్యాపేట, నవంబర్ 28: సూర్యాపేట జిల్లాలో సారా మహమ్మారి మళ్లీ కోరలు చాస్తున్నది. అమాయకుల ప్రాణాలను బలితీసుకుని, అనేక కుటుంబాలను రోడ్డున పడేసిన సారాపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. తయారీ, విక్రయాలను కట్టుదిట్టంగా ఆపేసింది. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సారా నియంత్రణను గాలికి వదిలేసింది. దాంతో తండాలు, గ్రామాల్లో నాటుసారా విచ్చలవిడిగా తయారవుతున్నది. ఎక్కడ పడితే అక్కడ సారా తయారు చేస్తుండంతో నెలకు వంద కేసుల చొప్పున నమోదు అవుతున్నాయి. ఇంకా బయటకు రాని తయారీ స్థావరాలు వేలల్లో ఉంటున్నాయి. అందులో వెలుగు చూస్తున్న కేసులు కొన్ని మాత్రమే. 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు 1030పైగా కేసులు నమోదవగా, 800మందిపై కేసులు పెట్టారు.

జిల్లాలో సారా తయారీ విపరీతం అవుతున్నది. తండాలు, గ్రామాలే కాకుండా పట్టణాల్లోనూ సారా తయారు చేసి విక్రయిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సారీ తయారీపై నియంత్రణ లేకపోవడంతో పరిస్థితి చేయి దాటిపోతున్నది. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా గడిచిన పది నెలల్లో ఎక్సైజ్ శాఖ 1,030 కేసులు నమోదు చేసింది. అంటే సగటున నెలకు 90 నుంచి వంద సారా కేసులు నమోదు అవుతున్నాయి. ఇవి కేవలం ఎవరైనా ఇచ్చిన సమాచారంతో తనిఖీలు చేసి పట్టుకుంటున్నవి మాత్రమే. వాస్తవానికి క్షేత్రసాయిలో రహస్య ప్రదేశాలలో పెద్ద ఎత్తున్న సారా తయారు చేస్తూ విక్రయాలు జరుపుతున్నారు. ఇప్పటి వరకు నమోదైన సారా కేసుల్లో 4,650 లీటర్ల సారా, 1.90 లక్షల లీటర్ల పానకం, 22 వేల కిలోల బెల్లం, 4,500 కిలోల పటిక, 180 వాహనాలు పట్టుకొని సీజ్ చేశారు.

**నాడు ఉక్కుపాదంతో అణిచివేత**

సారా కారణంగా గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల్లోని నిరుపేద ప్రజలు అనారోగ్యం బారిన పడి మరణాల సంఖ్య పెరుగుతుండడంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సమస్యను గుర్తించి రాష్ట్రంలో ఎక్కడా సారా తయారీ ఉండొద్దని నిర్ణయించారు. కేసీఆర్ పాలన ఉన్న వరకు జిల్లాలో ఎక్కడా సారా మాట వినిపించ లేదు. ఇతర ప్రాంతాల నుంచి కూడా రవాణా లేదు. సారా తయారీని కుటీర పరిశ్రమగా ఏర్పాటుచేసుకుని జీవించిన వారి ఉపాధి కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించి ప్రత్యామ్నాయ మార్గాలను చూపింది. కిరాణం, పాడి పరిశ్రమ ఇలా వారు ఏది కావాలంటే అది ఏర్పాటు చేసింది. నాడు నల్లబెల్లం అనవాళ్లు కూడా కనిపించేవి కాదంటే సారాపై కట్టడి, ప్రజారోగ్యంపై శ్రద్ధ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వం సారా తయారీని కట్టడి చేయకపోవడంతో అడ్డూఅదుపు లేకుండా పోయింది. గత వారం రోజుల వ్యవధిలో చివ్వెంల మండల పరిధిలోని లక్ష్మీనాయక్‌తండా శివారులో జిల్లా ఎక్సైజ్ , ఏసీ ఎన్‌ఫోర్స్ మెంట్ బృందం తనిఖీలో ఒక్క డీసీఎం వాహనంలోనే 2,750 కేజీల నల్ల బెల్లం, 40 కేజీల పటిక, 10 లీటర్ల సారాను పట్టుకున్నారు.

**మళ్లీ సారా చావులు చూడాలా?**

సమైక్య పాలనలో తెలంగాణలో సారా చావులు అనేకం. వృద్ధులే గాక నడి వయస్సు వాళ్లు, యువత కూడా సారాకు బానిసై చనిపోవడంతో వారి కుటుంబాలు దీన స్థితికి వెళ్లేవి. ప్రతి గ్రామంలో సుమారు వంద మంది వరకు సారాకు బానిసలుగా మారి చనిపోయిన వారు ఉన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఈ సమస్యను గుర్తించిన ఉద్యమ నాయకుడు కేసీఆర్ స్వరాష్ట్రంలో ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో సారా అనే పదం లేకుండా చేశారు. కానీ మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే సారా ఏరులై పారుతున్నది.

**సారా తయారీపై ఫిర్యాదు చేయండి**

జిల్లాలో సారా తయారీని ఉపేక్షించేంది లేదు. ఎక్కడైనా నల్లబెల్లం, పటిక కనిపిస్తే బాధ్యతగా వెంటనే సమాచారం అందించాలి. ఎనిమిది నెలలుగా పెద్ద సంఖ్యలో కేసులు నమోదు చేశాం. సరిహద్దు జిల్లాల నుంచి వచ్చే వాహనాలను కూడా పట్టుకుని కేసులు పెట్టాం. సారా తయారీపై ఎలాంటి సమాచారం ఉన్నా 8712658938 నెంబరుకు ఫిర్యాదు చేయొచ్చు.

- ఆర్.లక్ష్మానాయక్, ఎక్సైజ్ శాఖ సూపరిండెంట్, సూర్యాపేట


## ఉద్యమ యాదిలో..

### నేడు బీఆర్ఎస్ దీక్షా దివస్

- జిల్లా కేంద్రంలో ఏర్పాట్లు
- పాల్గొననున్న మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు
- స్వచ్ఛందంగా తరలనున్న 5వేల మంది కేడర్
- నాటి తెలంగాణ ఉద్యమ స్మృతుల నెమరు
- వేదిక వద్ద ఎల్ఈడీ స్క్రీన్లు, ఫొటోల ప్రదర్శనలు
- ఏర్పాట్లను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే పైళ్ల

తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను యావత్ భారతదేశానికి చాటి చెప్పిన రోజు. చావో, రేవో అంటూ ఉద్యమ సారథి కేసీఆర్ తన ప్రాణాలను లెక్కజేయకుండా తెలంగాణ కోసం ఆమరణ దీక్షకు పూనుకున్న సందర్భం. తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో చిరస్మరణీయమైన రోజు. కుల మతాలకు అతీతంగా తెలంగాణలోని సబ్బండ వర్గాలను ఏకం జేసిన తరుణం. తెలంగాణ పోరాట వారసత్వాన్ని మరోసారి ప్రపంచానికి చాటిన వైనం. చరిత్ర పుటల్లో నిలిచిన ఆ రోజు 2009 నవంబర్ 29. కేసీఆర్ ఆమరణ దీక్ష చేపట్టిన ఆ రోజును అందరం దీక్షా దివస్‌గా గుర్తు చేసుకుంటున్నాం.

– యాదాద్రి భువనగిరి, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ)



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నాటి ఉద్యమ రథసారథి, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన దీక్షను చాటిచెప్పేలా రాష్ట్రవ్యాప్తంగా దీక్షా దివస్‌ను నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. ఆ మేరకు భువనగిరి జిల్లా కేంద్రంలో శుక్రవారం దీక్షా దివస్ నిర్వహించనున్నారు. భువనగిరి పట్టణంలోని ప్రిన్స్ కార్నర్ వద్ద ఈ కార్యక్రమం చేపట్టనున్నారు. ఎమ్మెల్సీ, కార్యక్రమం ఇన్‌చార్జి పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, పైళ్ల శేఖర్ రెడ్డి, బూడిద భిక్షమయ్య గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, చింతల వెంకటేశ్వర్ రెడ్డి, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి తదితరులు హాజరుకానున్నారు.

**5 వేల మందితో దీక్షా దివస్**

దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ పార్టీ అన్ని ఏర్పాట్లు చేసింది. కార్యక్రమం విజయవంతం చేసేందుకు పలువురు నేతలకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించింది. 5వేల మందితో కార్యక్రమం విజయవంతం చేసేందుకు ప్రణాళిక రూపొందించింది. భువనగిరి నియోజకవర్గం నుంచి 2వేల మంది, ఆలేరు నుంచి 1,500, మిగతా మూడు నియోజకవర్గాల్లోని 5 మండలాల నుంచి 1,500 మంది తరలిరానున్నరని అంచనా వేసి ఆ మేరకు ఏర్పాట్లు చేసింది. అన్ని నియోజవర్గాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు బైక్, కార్ ర్యాలీలతో స్వచ్ఛందంగా తరలి రానున్నట్లు తెలుస్తున్నది.

**నాటి ఉద్యమ స్మృతుల నెమరు వేసుకునేందుకు..**

60 ఏండ్ల తెలంగాణ ప్రజల బలీయమైన ఆకాంక్ష టీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావంతో సరికొత్త పంథాను ఎంచుకుంది. నీళ్లు–నిధులు–నియామకాలు నినాదంతో, తెలంగాణ సాధనే లక్ష్యంగా ప్రజాస్వామ్యయుతంగా రాజకీయ అనివార్యతను సృష్టించింది. ఎన్నో అవమానాలు.. మరెన్నో అవహేళనలు.. కుట్రలకు ఎదురునిలిచి ముందుకు సాగిన టీఆర్ఎస్ పార్టీ ప్రస్థానం తెలంగాణ రాష్ట్ర సాధన విషయంలో కేసీఆర్ రాజీలేని వైఖరిని తేటతెల్లం జేస్తుంది. బక్కపలుచని వ్యక్తితో అయ్యేది లేదు.. పొయ్యేది లేదు.. తెలంగాణ వచ్చేది లేదు అంటూ ఎగతాళి చేసిన వాళ్ల ముఖం కేసీఆర్ సంకల్ప బలం ముందు వెలవెలబోయింది. దీక్షా దివస్ స్ఫూర్తితో 60 ఏండ్ల ప్రజల కాంక్షలను నిజం చేస్తూ.. 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది. ఈ నేపథ్యంలో కేసీఆర్ ఉద్యమ నేపథ్యాన్ని వివరిస్తూ ప్రత్యేక డాక్యుమెంటరీని ప్రదర్శించనున్నారు. ఇందుకోసం ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. నాటి ఉద్యమ ఘట్టాలపై ఫొటో ప్రదర్శన నిర్వహించనున్నారు. కేసీఆర్ పోరాట పంథా, ఉద్యమ జ్ఞాపకాలను నేటి యువతకు వివరించనున్నారు. అదే విధంగా సీఎంగా కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలియజేయనున్నారు. కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.


దీక్షా దివస్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణా రెడ్డి

**ఏర్పాట్లను పరిశీలించిన పైళ్ల..**

భువనగిరి పట్టణంలోని ప్రిన్స్ కార్నర్‌లో నిర్వహించనున్న దీక్షా దివస్ ఏర్పాట్లను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డితో కలిసి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి గురువారం పరిశీలించారు. సభాస్థలి పనులపై ఆరా తీశారు. నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

**సూర్యాపేటలో..**

దీక్షా దివాస్‌ను పురస్కరించుకొని సూర్యాపేటలో భారీ కార్యక్రమం చేపట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ సన్నాహాలు చేసింది. స్థానిక బతుకమ్మ ఘాట్ వద్ద 3వేల మందికిపైగా శ్రేణులతో కార్యక్రమం తలపెట్టింది. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గాదరి కిశోర్ కుమార్, బొల్లం మల్లయ్యయాదవ్‌తోపాటు కార్యక్రమం కో–ఆర్డినేటర్, నల్లగొండ జడ్పీ మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒంటెద్దు నర్సింహారెడ్డి పాల్గొననున్నారు.


బొల్లేపల్లి పాఠశాలలో పాఠం బోధిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

## టీచర్‌గా మారి.. పాఠాలు బోధించి!

### ప్రభుత్వ పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

భువనగిరి అర్బన్, నవంబర్ 28 భువనగిరి మండలంలోని బొల్లేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ హనుమంతరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లో తిరిగి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను తెలుసుకున్నారు. ఉపాధ్యాయుడిగా మారి ఇంగ్లిష్ బోధించారు. కొందరు విద్యార్థులు ఆంగ్లంలో ఒక్క వాక్యం కూడా సరిగ్గా రాయకపోవడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు.


## డిసెంబర్‌లో యాదాద్రి పవర్ ప్లాంట్ ప్రారంభం

- హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి
- విద్యుత్ సంస్థల సీఎండీ ముషరఫ్ అలీ ఫారూఖీ

దామరచర్ల, నవంబర్ 28 : మండలంలోని యాదాద్రి పవర్ ప్లాంట్ రెండో యూనిట్‌లో డిసెంబర్‌లో పూర్తిస్థాయిలో 800 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించనున్నట్లు విద్యుత్ సంస్థల సీఎండీ ముషరఫ్ అలీ ఫారూఖీ తెలిపారు. ఈ మేరకు గురువారం పవర్ ప్లాంట్‌ను ఆయన సందర్శించి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రారంభం కోసం ప్లాంట్‌లో నిర్మిస్తున్న పైలాన్, సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో హెలీప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు. ప్రారంభానికి ముందు స్థానికులు, భూనిర్వాసితులకు కల్పించే ఉద్యోగాల గురించి అధికారులతో చర్చించారు. బీహెచ్ఈఎల్, టీఎస్ జెన్‌కో అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, జెన్ కో డైరెక్టర్లు, ప్లాంట్ సీఈ సమ్మయ్య ఉన్నారు.

## నేటి నుంచి అర్వపల్లి ఉర్సు

అర్వపల్లి, నవంబర్ 28 : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే అర్వపల్లి శివారులోని హజ్రత్ ఖాజా నసీరుద్దీన్ బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. రెండ్రోజులపాటే సాగే ఉర్సుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వేలాది భక్తులు తరలిరానున్నారు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు అర్వపల్లి పోలీస్ స్టేషన్‌లో ముస్లిం పెద్దల ఆధ్వర్యంలో పూజలు చేసి గంధాన్ని ఊరేగింపుగా దర్గాకు తీసుకురానున్నారు. అర్ధరాత్రి ఖవ్వాలి నిర్వహిస్తారు. శనివారం సాయంత్రం దీపారాధన ఉంటుంది. ఉర్సు సందర్భంగా దర్గాను విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తుల సౌకర్యం కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు దర్గా నిర్వాహకుడు మహమ్మద్ అబ్దుల్ హుస్సేన్ తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్ఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటుచేశారు. జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ షేక్ మహ్మద్ గురువారం ఏర్పాట్లను పరిశీలించాడు.


విద్యుత్ వెలుగుల్లో ఖాజా నసీరుద్దీన్ బాబా దర్గా


ఆత్మకూరు(ఎం) కేజీబీవీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

## సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

### కేజీవీపీ ఉపాధ్యాయుల నిరసన

ఆత్మకూరు(ఎం), నవంబర్ 28 : పనికి తగిన వేతనం చెల్లించాలని కోరుతూ మండల కేంద్రంలోని కేజీబీవీ ఎదుట ఉపాధ్యాయులు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో పని చేసే టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులకు బేసిక్ పే చెల్లించడంతోపాటు రెగ్యులర్ ఉద్యోగులగా మాదిరిగా సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వివక్ష చూపకుండా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ పద్మ, ఉపాధ్యాయులు స్వప్న, సంధ్య, భారతమ్మ, సరిత, క్రాంతికుమారి, అంజుమ్, ఉమారాణి, రాధదేవి, నాగమణి పాల్గొన్నారు.

## డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

రామగిరి, నవంబర్ 28: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో గురువారం నుంచి డిగ్రీ సెమిస్టర్ 3, 5 పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 33 పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని పలు పరీక్ష కేంద్రాలను ఎంజీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి, పరీక్షల నియంత్రణాధికారి జి.ఉపేందర్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని, మాల్ ప్రాక్టీస్ జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


నల్లగొండలోని డీవీఎం కళాశాలలో పరీక్షలను పరిశీలిస్తున్న ఎంజీయూ రిజిస్ట్రార్ రవి, సీవోఓ ఉపేందర్‌రెడ్డి